ఇంజనీరింగ్ చదువుతున్న ఫ్రెండ్స్ నాకు అనేక మంది ఉన్నారు. కాని అనూ గాఢ పరిచయం కావడంతో నేను జీవి

డం బహు అరుదు, బహుశా ఇప్పటికి కూడా, ఒకొక్క కాలేజీలో ముగ్గురు నలుగురు కంటే ఉండరనుకొంటా.




తంలో మొదటి సారిగా ఆ కోర్స్ చదివే అమ్మాయిని కలుసుకున్నట్టయింది. ఆ రోజుల్లో ఆడవాళ్ళు ఇంజనీరింగ్ చదవ

ప్రభుత్వం వారి ట్రాన్స్ఫర్ ఆర్డర్ చేతికందిన రెండు నెల్లకి వెతగ్గా వెతగ్గా దొరికిన ఇల్లు బీచి ఒడ్డున ఉండటం

అప్పట్లో మా నాన్నగారికి చాలా సంతోష దాయకమైంది. రెండు సంవత్సరాల తేడాతో ఒకే డిగ్రీ చదువుతున్న చెల్లెళ్ళకు లోకల్ కాలేజీలో సీట్లు దొరికేటప్పటికి, మేమా ఇంట్లో దిగేటప్పటికి సముద్రం మీద తన నవ్వులు నిండుగా చిలకరిస్తున్న చంద్రుడు చిక్కి సగమై పోయాడు.

ఆఫీస్ లేకపోయినా ఆదివారం ఉదయమే ఫ్రెష్‌గా తయారయిపోయి జగదాంబలో మళయాళం పిక్చర్‌కా, జ్యోతిలో ఈ రోజే రిలీజవుతున్న తెలుగు దానికా అనే డైలమాలోంచి బయట పడకుండానే నడుస్తూ గేటు దాటుతున్న నాకు

"హలో మీరు వసంతా వాళ్ళ బ్రదర్ కదూ! నా పేరు అనూరాధ. ఇక్కడే బి. ఇ. సెకండియర్ చదువుతున్నా" అంటూ తన్ను తాను పరిచయం చేసుకొందో నడిచే బాపూ బొమ్మ.

"మ....మైనేమ్.. రాఘవరావ్, ప్లీజ్ టుమీట్‌యు. వర్కింగ్ ఇన్. ..పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్" కంగారుగా మాటల్ని కొన్నిటిని వదిలేసి, కొన్నిటి స్థానాలు మర్చి ఎల్లాగో ముగించాను, లోపల ఆమె చదువు గురించి అనుమానం తలెత్తింది. బి ఇ. అన్నట్టు వినబడిందే? బీ, ఇ. వా? బి. ఏ. వా? సరిగా అడిగితే? ఛ! ఇప్పుడేగా చెప్పింది వెంటనే అడిగితే సరిగా విన్నందుకు ఎలా చూస్తుందో?

"అదేంటండీ అలా నేలకేసి చూస్తూ ఉండిపోయారు నాతో మాట్లాడ్డం ఇష్టం లేదా మీకు"

"అబ్బె అదేం లేదండీ, ఇంతకీ ఏ కాలేజీలో చదువుతున్నారు మీరు?" మనసులో జరిగిన మధనం దృష్టిలో పెట్టుకొని ఆవిడ చదువుతున్నదేమిటో తెలివిగా తెలుసుకోడానికి అడిగానని సంతోషించడం పూర్తి కాలేదింకా.

"బావుందండీ మీ ప్రశ్న! మీరు నే చెప్పింది సరిగా వినలేదన్న మాట, ఈ వూళ్ళో ఇంజనీరింగ్ కాలేజీలు ఎన్ని ఉన్నాయేం?"

దొరికి పోయిన దొంగ ముఖం పెట్టబోయి అంతలో తమాయించుకొని "ఆదే దే కాలేజీయా నైట్ కాలేజీయా అని"

రోడ్డు మీద నడుస్తూ చూసుకోక గోతిలో కాలేసి పడబోయి నిలద్రొక్కుకుని "అబ్బె గొయ్యో కాదోనని అనుమానం వచ్చి" అన్నవాడికేసి చూసినట్లు జాలిగా చూసింది.

అంతలోనే ముఖంలో ఫీలింగ్ మార్చి "సర్లెండి పట్టపగలు వెళ్తుంటేనే కావలసినన్ని కామెంట్లు 'ఆడదానికి దీనికెందుకురా ఇంజనీరింగ్. అందులోనూ మెకానికల్. మెషీన్స్‌తో వర్క్ చేయడమంటే కుట్లూ అల్లికలు నేర్చుకోవడం అనుకుంటున్నట్లుంది అమ్మడు. నాట్రోజులు పోనీ దెబ్బకి భయపడి పారిపోతుంది' అంటూ మాటలు, 'నీ అందాల చేతులు కందేను పాపం ఎందుకు ఈ

---

నిర్వచనాలు : చలి:-మూడు కాళ్ళ ముదుసలి

---

బెడద' అంటూ పాటలూనూ."

నాకు ఏమనడానికి తోచక "మరే! మరే!" అంటూ అటూ ఇటూ చూస్తూన్నా.

ఇంతట్లో "పాపం మార్నింగ్ షోకి బయలుదేరారులావుంది వెళ్ళండి వెళ్ళండి లేటయిపోతూంది" అంటూ మా ఇంట్లోకివెళుతూ"అన్నట్లు నా పేరైనా సరిగ్గా విన్నారా" అని అడిగి నేను చెప్పడానికి నోరు తెరవ బోతుంటే "అనూరాధ" అంటూ తనే చెప్పేసి హడావిడిగా లోపలికి వెళ్ళిపోయింది.

తను ధైర్యంగా నిల్చుని ప్రశ్నలు వేసేసి నన్ను కంగారు పెట్టేయడంతో నేను చుట్టూ పరిసరాల కేసి, నేలకేసి ఎక్కువగానూ, ఆమెకేసి తక్కువగానూ చూడడంతో మొదటిరోజు ఆమె రూపాన్ని విపులంగా చూడలేదు. కొన్ని చూసిన మొదటిసారి మాత్రమే కాకుండా ఆమెని కలిసిన ప్రతీసారి ఆమె ముఖంలోకి చూసినప్పుడల్లా నన్ను కలవర పెట్టేవి ఆమె కళ్ళు. అవి చూసేచూపు ఎదుటి మనిషి మాత్రమే కాకుండా వారి మెదడు లోని భావాలను కూడా చదవగలదా అనిపించేట్లుండేది.

స్వతహాగా నాది కొంచెం పిరికి స్వభావం. తప్పుని సరైతే తప్ప ఏపని నుంచైనా తప్పించుకోవాలనే ప్రయత్నించేవాణ్ణి. నాస్నేహితుల ద్వారా మెతక వాడిగా ముద్రవేయబడ్డా కూడా. కానీ అనూరాధ ఎందుకో నాకు కావాలని దగ్గరయింది అనిపిస్తుంటుంది గతంలోకి వెళ్ళి ఆలోచిస్తున్నప్పుడల్లా. తను ఎప్పుడూ చలాకీగా ఉండేది. తెలివితేటలు, అందం నాసొంతం అనే అహం చిందులాడుతున్నట్టుంటుంది - భౌతికంగానేకాదు మానసికంగా కూడా అనూరాధ విలక్షణమైన భావాల కలయిక. "నాకున్న పరిధుల్లోనే లోకాన్ని ఎదిరించి బ్రతకాలనుంటుంది! ఈలోకం తనకు తానై నాకేమీ ఇవ్వక్కర్లే. నేనే నాక్కావలసింది ఈ లోకంనుంచి పిండి తీసుకోగలను. చాలామంది చెయ్యలేమనుకొనే పనిచేస్తే నాకెందుకో గొప్ప సంతోషంగా ఉంటుంది. అందుకే నా ఫ్రెండ్సందరూ ఇంటర్‌లో ఆర్ట్సులోకి, కొందరు బోటనీ, జువాలజీల్లోకి వెళితే నేను మాథ్స్ తీసుకొన్నా. ఇంజనీరింగ్ చదవడం కూడా నా ఎదిరించే తత్వానికి ప్రతీక" అంటుండేది.

చదువులోనూ, స్వభావంలోనూ మాత్రమే కాదు మాటల్లోకూడా మహా చురుకు,

ఓసారి బస్సులో వెళ్తుండగా తను లేడిస్ సీట్లో కూర్చొంది. ఆమె పక్క సీటు ఖాళీ. ఆమె స్వభావం తెలిసిన నేను ఆమెకు ప్రక్కనే కొద్ది దూరంగా ఉన్న సీట్లో కూర్చొన్నా. ఇంతట్లో బస్సు ఆగడంతో స్టాపులోని కొంత జనం ఎక్కారు. వెనక కొన్ని సీట్లు ఇంకా ఖాళీగా ఉన్నాయి. ఒక ఇరవై రెండేళ్ళ యువకుడు ఆమె ప్రక్కనే కూర్చున్నాడో లేదో "ఎక్స్‌క్యూజ్‌మి, దిస్

ఎండ: -కరుణ లేని బండ

సీటీజ్ ఇండిపెండెన్ ఫర్ లేడీస్, ఇఫ్ యువార్ ఎ లేడీ సిట్ కంఫర్టబ్లీ-నో ప్రాబ్లమ్" అనేసి కిటికీవైపు తిరిగి రుమాలు నోటికడ్డం పెట్టుకుంది. కుర్రాడు పాపం కాళ్ళకింద బాంబు పేలి నట్లు లేచి నిలబడి తనకేసి నవ్వుతూ చూస్తున్న ముఖాలు చూడలేక వెనక్కి పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు. నాకు భలే కోపమొచ్చింది. పాపం ఆ కుర్రాడు తొందర్లో కూర్చున్నాడేమో నోటికొచ్చినంతా అనెయ్యడమే! మరీ అంత దుడుకుతనం పనికిరాదు.

దిగిన తర్వాత ఈభావమే వెలిబుచ్చే సరికి "చూడండీ ప్రపంచంలో అంతా మీలా నొప్పించక తానొవ్వక అనే స్వభావంతో ఉంటారనుకోకండి. ఆ కుర్రాడిని చాలా సార్లు చూశాను. ప్రతి సారి బస్సులో వెనకంతా ఖాళీగా ఉన్నా ఆడవాళ్ళ ప్రక్కనే కూచుంటాడు కావాలనే. ఒక సారయినా కాస్త ఘాటుగా ఇవ్వకపోతే...."

మరోసారి బీచిలో నడుస్తున్న మా ప్రక్కనుంచి ఇద్దరు యువకులు మాట్లాడుకుంటూ వెళ్తున్నారు.

"ఫిగర్ బాగుంది గురూ"

"కానీ పోజు ఎక్కువ బాసూ"

"ప్రక్కన వీడెవడు చింపాంజీలా, బాడీగార్డా?" ఎటోచూస్తున్న వాడల్లా అనూరాధకేసి చూసేటప్పటికి విసురుగా వెనక్కి తిరిగి వెళుతూ కన్పించింది, వాళ్ళిద్దరి ముందూ నిలబడి "క్షమించండి ఒక్క నిముషం" అని హేండ్‌బాగ్‌లోంచి మిర్రర్ తీసి వాళ్ళిద్దరి ముఖాల ముందు ఓసారి పెట్టి "ఒక్కసారి చూసుకోండి ఎలా ఉన్నాయి మొహాలు? మనుషులు కోతులనించి పరిణామం చెందారని చిన్నప్పట్నుంచి చదువుతున్నా నమ్మ బుద్ధెయ్యలేదు కానీ మిమ్మల్ని చూశాక తప్పట్లేదు, ఒక్క విషయం, మరొకళ్ళని కామెంట్ చేయడానికి పెద్ద ప్రజ్ఞ అక్కరలేదు. కానీ మనం చేసే కామెంట్ అవతలి వ్యక్తిని కూడా నవ్వించ గలగాలి. అంతేగాని....... బైదిబై ఈ మిర్రర్ మీ దగ్గరుంచుకొని ఎవర్నైనా కామెంట్ చేసే ముందోసారి....వసా" అనకోని ఈ షాక్ నుంచి వాళ్ళు తేరు కోకముందే వచ్చేసింది.

• • • •

అసలు ఛార్లెస్‌ను అనురాధకు పరిచయం చేసింది నేనే, అయితే వాళ్ళిద్దరి మధ్య స్నేహం అంత త్వరలో అంత గాఢంగా పెరిగి పోతుందని గాని, కెమికల్ రియాక్షన్స్‌లో కెటలిస్ట్‌లా నాపని న్యూట్రల్‌గా ఉండి పోతుందని గాని ఆరోజు నేను ఊహించని విషయం.

అధైర్యస్తుడిగా, ముఖావంగా ఉండే నాకు ఓ విదేశీయుడు స్నేహితుడుగా ఉండడం అప్పట్లో గర్వకారణంగా ఉండేది, ఆగర్వాన్ని అనూరాధముందు చాటుకొనే ప్రయత్నంలో ఒక భాగమే అతన్నిపరిచయం చేయడం. వైజాగ్‌లో ఒక ప్రయివేట్ కంపెనీలో అసిస్టెంట్

ఇంజనీర్‌గా పనిచేస్తున్నా ఛార్లెస్ మాతృదేశం ఇంగ్లండ్.

"అనాది మానవుడిలో ఉండే సంచార ప్రవృత్తి కొంచెం ఎక్కువ పాళ్ళలోనే నాలో మిగిలిపోయింది. అందుకే ఇంగ్లండ్ నుంచి నా' హైస్కూల్ స్టడీస్ కాగానే ఇండియావచ్చి ఢిల్లీలో ఇంజనీరింగ్ చదివాను. సౌత్‌లో వర్క్ చేయాలనిపించి వైజాగ్ వచ్చా. సింగపూర్ వెళ్ళి కొన్ని నెలలయినా అక్కడుండాలని నాకోరిక, ఎప్పటికి తీరుతోందో మరి?" అప్పుడెప్పుడో చెప్పాడు ఛార్లెస్.

వాళ్ళిద్దర్నీ పరిచయం చేసిన తర్వాత మా ఆఫీస్‌లో ఇన్స్‌పెక్షన్! నా అఫీషియల్ కేంపులు మొదలైన వాటితో పది రోజులదాకా వాళ్ళని విడివిడిగానే తప్ప కలిసి ఉండగా కలవడం పడలేదు. తర్వాత ఓరోజు సాయంత్రం బీచిలో వాళ్ళు కూర్చున్న చోటికి వెళ్ళి పలకరించి ప్రక్కనే కూర్చున్నా. అప్పుడే సిగరెట్ ముట్టించ బోతున్న ఛార్లెస్ ను "స్మోక్ చేయడం మానవా" అంది అనూరాధ.

"ప్రయత్నిస్తా"

"ప్రయత్నించడంకాదు"

"తగ్గిస్తా సరేనా"

పదిరోజుల్లోనే ఆమె సంపాదించిన అధికారానికి అతను తలఒగ్గుతున్న తీరు గమనించాను.

"తగ్గించడంకాదు ఈరోజుతో మానేస్తానని ప్రామిస్ చేశావ్"

ఛార్లెస్ తలమీద ఎడంచేత్తో కొట్టుకుంటూ అన్నాడు.

"చంపేశావ్! నీకు జ్ఞాపకశక్తికూడా ఎక్కువ"

"ఔను నీకు అన్ని విషయాలు ఎలా గుర్తుంటాయి" మాటల్ని కాస్త మామూలు ధోరణిలోకి తెద్దామనుకుంటూ నేను కల్పించుకొన్నా.

"నాకా! భలేవాడివే. ఓ జోక్ చెప్తా విను. ఓసారి అద్భుతమైన జ్ఞాపకశక్తి ప్రదర్శిస్తున్నాడొకతను ఓ పార్టీలో. కుతుహలంతో ఒకాయన అయన్నడిగాడు. మీరన్ని విషయాలు ఎలా గుర్తుంచుకొంటున్నారని. ఏముంది నేను కొన్నాళ్ళు ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశా, ఓసారి పారాచూట్‌తో విమానంనుంచి దూకడం ట్రయినింగ్ ఇస్తూ రెడీ అనగానే దూకేశా, ఇంతట్లో పైనుంచి వినబడింది ఆఫీసర్ గొంతు పారాచూట్ మర్చిపోయావని. అప్పట్నుంచి ఏదీ మర్చిపోవడం లేదు. అని చెప్పాట్ట. ఎలా వుంది?" అంటూ కనుబొమ్మలు ఎగరేసింది.

....ఆతర్వాత....

o o o

ఖగోళ శాస్త్రజ్ఞుల లెక్క ప్రకారం భూమి సూర్యుడి చుట్టూ ఓసారి తిరిగొచ్చింది. నా జీవితంలో పెద్దమార్పేమీ లేదు కానీ అనూరాధ జీవితంలో రెండో మేజర్ ఆక్సిడెంట్ అయింది. (జీవితంలో మొదటి ఏక్సిడెంట్ పుట్టుక, రెండు పెళ్ళి, మూడు మరణం అని

అని ఎవరో కవిగారి ఉవాచ )

అయితే పుట్టుక మరణమంత అనెక్స్‌పెక్టెడ్ కాదేమో - పెళ్ళి కాస్తో కూస్తో ముందు తెలుస్తుంది. అనూరాధ పెళ్ళి నాకు మాత్రం అనెక్స్‌పెక్టెడ్ కాదు. నాలోని అంతరంగపు మూలల్లో కొంప దీసి అలా జరగదు కదా అని చాలా సార్లు శంకించబడ్డ విషయమే. అనూరాధ చూపే మొండి ధైర్యం చూసినా, ఎదిరించే ఆమె స్వభావం చూసినా నాకు మొదటినుంచీ భయమే. ఆమె భర్తని ఎంచుకొన్న విధానం కూడా ఆమె స్వభావ విరుద్ధమేం కాదు. కులాలు మతాలు, శాఖలే కాకుండా వీటన్నిటితో పాటు వరకట్నాలు కూడా నేటి యువతీ యువకుల పెళ్ళికి అడ్డుగోడలైతే ఒక మధ్యతరగతి యువతిగా అనూరాధ ఆ గోడల్ని కూల్చి బయటికి వెళ్ళడమే కాకుండా విదేశీయుడైన ఛార్లెస్‌ను పెళ్ళాడి చుట్టు పట్ల పెద్ద దుమారమే లేపింది.

తర్వాత ఆమె పెళ్ళయిన నాల్గు నెలలకి తండ్రి పోవడంతో ఆమెకు చెప్పుకోదగ్గ బంధువులెవ్వరూ మిగల లేదు. కూతురు చేసిన పనికి కుమిలి, కుమిలి పోయాడన్నారు ఆమె చేసిన పని కిట్టని కొందరు. నాకు తెల్సున్నంతలో ఆయన ఆ విషయమై ఎన్నడూ బాధ పడలేదు.

జీవితం సరళరేఖ అయితే మరణం ఒక బిందువు మాత్రమే. తనకు ఒక్కగా నొక్క కూతురు అతని దృష్టిలో యోగ్యుణ్ణే (విదేశీయుడైతేనేం) పెళ్ళాడింది, తను జీవితంలో చేయవలసిందేమీ మిగలలేదు. మార్గం సరళరేఖలా సుగమమం కావడంతో సహజంగానే మరణ బిందువు దగ్గరయి ఉంటుంది.

అనురాధ వివాహం తర్వాత వాళ్ళిద్దరూ కలిసి ఉంటున్న ఇంటికి చాలాసార్లు వెళ్ళాను. మొదటిసారి ఇంట్లో ప్రవేశించగానే కన్పించింది ఓ అందమైన అమ్మాయి చేతులు జోడిస్తూ వచ్చేవారిని ఆహ్వానిస్తున్నట్లుండే క్యాలెండరు. తర్వాత కొన్ని రోజులకు వెళ్ళేటప్పటికి నెల మారడంతో పేజీమారి అమ్మాయి చేతులు అలవోకగా పూలను నీటిలోకి జారుస్తున్నాయి. అక్యాలెండరు లోని అన్ని బొమ్మలనూ చూడడానికి నాకు అవకాశం కుదరలేదు, మామగారు పోయిన రెండు నెల్లకే ఛార్లెస్‌కు ప్రమోషన్ మీద భోపాల్ ట్రాన్స్‌ఫర్ కావడంతో.

"నీ చదువు డిస్కంటిన్యూ చేస్తావా" అడిగాను అనూరాధని.

"ఆఁ ప్రస్తుతానికి అంతేమరి. కొంత నయం, థర్ ఇయర్ ఎగ్జామ్స్ కూడా అయిపోయాయి. కోర్సు ఇంకా రెండేళ్ళకు గాని పూర్తికాదు - అక్కడికీ అతను ప్రమోషన్ వదులుకొనైనా కోర్సు అయిందాకా ఇక్కడే ఉంటాను అన్నాడు

'పోనీ నా కోర్సు అయిందాకా ఇక్కడే ఉంటాను నువ్వెళ్ళి అక్కడ

జాయిన్ అయిపోకూడదూ అన్నదానికి మౌనంగావుండి పోయాడు, ఇప్పటికే అనేకసార్లు నిన్ను విడిచి ఎక్కడికి వెళ్ళినా నా శరీరంలో కొంతభాగం విడిచి వెళ్ళినట్టుంటుంది అన్నాడు. బహుశా నా ప్రశ్నకు కూడా అదేసమాధానం కాబోలు. ఎంత మనస్సులో అరమరికలు లేకుండా బ్రతుకుతున్నామనుకొనే భార్యాభర్తల కైనా హృదయపు ఏ చీకటి మూల ల్లోనో కొన్ని సున్నితమైన విషయాలు చెప్పకుండా మిగిలి పోతాయి. వాటిని బలవంతాన స్పృశించి బయట పెట్టాలని ప్రయత్నించడంవల్ల ఇదరికీ చికాకు తప్ప ఏమీ మిగలదు' కనుక నేను ఆవిషయం మళ్ళా ప్రయత్నించలేదు. అదీకాక ప్రస్తుతం ఇక్కడ నాకంటూ ఎవరూలేరు. హాస్టల్లో చేరి ఉండాలి, నా జీవితానికి ఒక్కడే అయిన తోడును కొన్ని వందల మైళ్ళ దూరాన వదలుకొని అయినా ఎప్పటికైనా కోర్సు పూర్తిచేసి తీరతాను. ఆ విషయమై గట్టి నమ్మకముంది."

ఆమె జీవిత నాటకంలో త్వరత్వరగా మారుతున్న అనేక సీనుల్ని ఆసక్తిగా గమనిస్తున్న నేను, అందులో ఆమె నిర్వహిస్తున్న పాత్రని ఆమె స్వభావ సిద్ధమేనని సరిపెట్టుకుంటూ ప్రేక్షకుడి గానే మిగిలి పోయాను. కానీ భర్తకోసం చదువుమానుకొని వెళ్ళడం ఆమె స్వభా వానికి ఎలా అన్వయించాలో ఇప్పటికీ నాకర్థంకాదు. కొండలమీదుగా అమిత వేగంతో ప్రవహిస్తూ వస్తూ ఒక్కసారి మైదానం చేరి తనపూర్వపువడీ, వేగం కోల్పోయి ఇంచుమించు నిశ్చలస్థితికి చేరిన సెలయేరు మాత్రం జ్ఞప్తికి వచ్చింది.

o o o

తర్వాత ఆఫీసు రికార్డుల్లో నావయసు ఆరేళ్ళు పెరిగింది. ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చింది. పెళ్ళికొడుకుల మార్కెట్‌లో నేనింకా అమ్ముడు పోని ఆకర్షణీయ మైన వస్తువునే. ఛార్లెస్, అనూరాధల వద్దనుండి కొన్నాళ్ళు ఉత్తరాలు వచ్చాయి. ఆతర్వాత క్రమంగా తగ్గి పోయాయి.

ఈ మధ్యనే నెల్లూర్‌లో ఆఫీస్ పని ఉంటే పూర్తి చేసుకొని మెయిల్లో వస్తున్నా. కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని కూర్చుని విసుగేయడంతో ఒంగోలు ప్లాట్‌ఫారమ్ రాగానే దిగాను బాగ్ పట్టు కుని, (అందులో ఇంపార్టెంట్ పేపర్లు న్నాయి మరి) అటూ ఇటూ చూస్తున్న నాకు కొంచెం దూరంలో లైట్ల వెలుగులో కంపార్ట్‌మెంట్ విండోలోంచి బయటకు చూస్తున్న పరిచితమైన ముఖం కన్పిం చింది-పోల్చుకోవడం కష్టం కాలేదు. చక్కనమ్మ చిక్కితేనే కాదు కొద్దిగా లావైనా కూడా అందమే కాబోలు.

ఛార్లెస్ ప్రభావం అనూరాధ మీద బాగాపడ్డట్టుంది. బొట్టు పెట్టుకోలేదు.

---

పిల్లగాలి: -రూపం లేని జాలి.

---

చెవులకు తమాషాగా వ్రేలాడుతుండే రింగులు తీసేసింది. మాక్సీ లాంటిదేదో వేసుకుంది. దగ్గరయ్యేటప్పటికి గబుక్కున చూసింది.

"ఏయ్ మాన్ రా! రా! నిన్నుచూసి ఎన్నిరోజులయిందో" ఆమె కళ్ళలోని మెరుపును స్టేషన్‌లోని ఫ్లోర్‌సెంట్ లైట్లు సరిగా చూపలేకపోయాయి.

"ఎక్కడిదాకా" నాకేసి పరీక్షగా చూస్తూ అడిగింది.

"రాజమండ్రి"

గార్డ్ గ్రీన్ సిగ్నల్ చూపిస్తున్నాడు.

"అయితే లోపలికి వచ్చెయ్ నీతో మాట్లాడాలి"

జేబులో త్రీటయర్ టికెట్ మాత్రమే వున్న నేను ఫస్ట్ క్లాస్ కూపేకేసి అనుమానంగా చూస్తున్నా.

"ఏంటలా చూస్తున్నావ్, నువ్వెక్కిన కంపార్ట్‌మెంట్ వెనకనుందా? ఫర్లేదులే. అయ్యో నీకింకా అప్పటి పిరికితనం పోలేదన్నమాట. అంతకీ కండక్టర్ వస్తే ...ఏయ్ ట్రైన్ కదిలిపోతోంది క్విక్" మొత్తానికి ఆమె ఉన్న కంపార్టుమెంట్ ఎక్కా.

ఆమెకు ఎదురుగా ఉన్న బర్త్ మీద పడుకొని ఉన్నారు నాలుగైదేళ్లు ఉన్న కుర్రాళ్ళు, మొహంలో ఛార్లెస్ పోలికలు.

"నాకీ విషయం తెలియదే" పడుకున్న అబ్బాయిని చూస్తూ నవ్వుతూ అన్నా.

"ఉత్తరం రాసాను. అప్పటికే వైజాక్ నుంచి పారిపోయినట్టున్నావ్ ఎక్కడున్నావో తెలియ్లేగా"

"సరేకాని ఛార్లెస్ బావున్నారా"

కాసేపు మౌనంగా ఉండిపోయింది. వేగంగా పరిగెడుతున్న స్టేషన్ దీపాల వెలుతురులో ఆమె కళ్ళలో సన్నటి నీటి పొర ఏర్పడడం గమనిస్తున్న నాకు ఆమె కళ్ళు దుఃఖంతో ఆర్ద్రాలవడం చూడడం మొదటిసారి. ఎప్పుడూ ధైర్యంతోనూ తెలివి తేటలతోనూ మిల మిల లాడే ఆకళ్ళు నీరు చిందించడం నేను ఊహించలేని విషయం "ఛార్లెస్‌కు నాతో జీవితం బోరు కొట్టిందేమో రాఘవా, అందుకే వెళ్ళిపోయాడు."

"ఎక్కడికి? ఇంగ్లండా... లేపోతే ఎవరితోనైనా.. "

నేను జీవితంలో అనేక మంది విషయంలో ప్రిజుడైస్‌తో మాట్లాడా. కానీ అనురాధ ఎటోచూస్తూ మాట్లాడుతున్నదల్లా నాకేసి చివాలున చూసి అంతలోనే విషాదంగా నవ్వుతూ "నన్ను మాత్రమేకాదు ఈ లోకాన్నే విడిచి" అన్నపుడు తెల్సింది నేను ఒక మంచి వ్యక్తి ప్రవర్తన పట్ల ఎంత భయంకరమైన అనుమానాన్ని వ్యక్తం చేసానో.

తర్వాత విజయవాడ దగ్గరయేవరకూ అనేక విషయాలు చెప్తూనే

---

ఆకలి:- ఐంనెడు పొట్టలో బారెడు రోకలి

---

ఉంది తెచ్చిపెట్ట కొన్నసిబ్బరంతో. నేనూ వింటున్నా, మోటార్ ఏక్సిడెంట్‌లో ఫాదర్ పోయేటప్పటికి బాబుకి ఏడాదిట. ఇన్స్యూరెన్స్ డబ్బుతో వైజాగ్‌లో బి. ఇ. పూర్తిచేసి ఒక సంవత్సరం జె. ఇ. గా చేసి ఇపుడు రాజస్థాన్‌లోని "కోట" లో ఎక్స్‌పీరియన్స్ పుటప్ చేసి ఎ. ఇ. గా వెళుతున్నానని, విజయవాడలోని స్నేహితురాల్ని కలుసుకొని రెండు రోజులో బయలుదేరుతానని.

విజయవాడ దగ్గర కావడంతో లేచి సామాను సర్దుతోంది. నడకలో తేడా కనిపిస్తుండడంతో

"కాలు తిమ్మిరెక్కిందా కూర్చొని కూర్చొని"

నా అజ్ఞానానికి కాబోలు చిన్నగానవ్వి

"ఆక్సిడెంట్ అయినపుడు బైక్ మీద నేనూ ఉన్నా. కుడికాలు మాత్రం... "

కొద్దిగా మాక్సీ ఎత్తి చూపించింది ఆర్టీఫిషియల్ లింబ్!

"మైగాడ్" నాలోనేను గొణుక్కున్నా. నా కంఠంలో నాకు తెలియకుండానే సానుభూతి తొంగి చూసింది.

"చూడు రాఘవా నేను ఎవరేమన్నా సహించగలనేమోకాని "ఐపిటీయూ" అనే అర్థం వచ్చేటట్లు మాట్లాడితే మాత్రం సహించలేను, ఎన్ని కష్టాలొచ్చినా తట్టుకొని నిలబడ గల ధైర్యం నాకు పుట్టుకతో వచ్చినవిద్య. అధైర్యంతోనే జీవిత ప్రవాహంలో ఎదురీదుకొని వస్తున్నా అన్నట్లు స్టేషన్ వచ్చేసింది, మళ్ళా ఎప్పుడు కలుస్తామో..' బెస్ట్ ఆఫ్ లక్"

ఆమెతోబాటు నేనూ ప్లాట్ ఫారమ్ మీదకు దిగా. బాబుచేత టాటా చెప్పించి ఓచేత్తో నడిపించుకొని వెళ్ళిపోతోంది, అప్పుడు తూర్పునుండి వెలుగు రేఖలు విచ్చుకొంటున్నాయి.

"తమ సోమా జ్యోతిర్గమయా" అంటూ చీకటినుండి వెలుగులోకి చేర్చమంటూ ఎవర్నో ప్రార్థించే వాళ్ళలా కాక తనకు తానుగా తన జీవితంలో ముసురుతున్న చీకట్లని చీల్చుకొంటూ వెలుగు వైపు పయనిస్తోంది అనిపించింది అనూరాధ.

"ఆడది కాకూడదు అబల
ప్రయత్నించి కావాలి సబల"

ప్రభుత్వం తరపున నా ఉద్యోగ ధర్మంగా ఇలాంటి ప్రకటన లెన్నింటినో సేకరించి, కూర్చి పత్రికల్లో ప్రకటనలు వేయించాను. ...

కష్టాలను ఒంటరిగా ఎదుర్కొని గెల్చి హిమవన్నగంలా వ్యక్తిత్వాన్ని పెంచుకొంటూ పోతున్న ఆమె నా దృష్టిలో నిజమైన "అపరాజిత" ❋